మధురానగర్‌లో పనిచేయని నిఘా నేత్రాలు

రోజులు గడుస్తున్నా కానరాని మరమ్మతులు

రెచ్చిపోతున్న ఆకతాయిలు, పోకిరీలు

ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

పట్టించుకోని అధికారులు



మధురానగర్ సంక్షేమ సమితి కార్యాలయంలో సీసీ టీవీల్లో ఖాళీగా ఉన్న దృశ్యం

వెంగళరావునగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీసులు నిఘా నేత్రాల వైపు దృష్టి సారించారు. ఎక్కడ ఏం జరిగినా వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందేలా, నేరస్థులను పట్టుకునేందుకు దోహదపడేలా ప్రతీచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కమ్యూనిటీ, సేఫ్ పోలీసింగ్‌లో భాగంగా వ్యాపార, కాలనీ సంక్షేమ సంఘాలు, స్థానికుల నుంచి విరాళాలు సేకరించారు.

సుమారు రూ.26 లక్షలతో 32 సీసీ కెమెరాలు

మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కాలనీలో సుమారు రూ.26 లక్షలతో 32 సీసీ కెమెరాలను ఆరు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. కేబుల్, నిర్వహణ తదితర సమస్యలతో పాటు కొన్ని సీసీ కెమెరాలు పాడైపోయాయి. కొన్నిరోజుల క్రితం రూ.6.70 లక్షల వ్యయంతో కొత్తగా 23 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్క కెమెరా కూడా పనిచేయడం లేదు. రోజులు గడుస్తున్నా అవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. గతంలో మధురానగర్‌లోని పలు బ్లాక్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల నేరస్థులను పట్టుకున్నా, ప్రస్తుతం అవి పనిచేయకపోవడంతో ఆకతాయిలు, జులాయిలు, పోకిరీలు రెచ్చిపోతున్నారు. వీరి వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాత్రి, పగలు తేడా లేకుండా..

మధురానగర్ ఏ, బీ, సీ బ్లాక్‌లలో ప్రైవేట్ హాస్టళ్లు, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. టీ, టిఫిన్ సెంటర్ల వద్ద, నాలా ప్రధాన రహదారిపైన హాస్టళ్లలో ఉంటున్న యువతీయువకులతో పాటు ఎక్కడి నుంచో వచ్చి కొంతమంది రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆయా ప్రాంతాల్లో తిష్ట వేస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెట్రో కార్, బ్లూ కోట్స్ సిబ్బంది వాహనాలపై సైరన్ వేసుకుని తిరుగుతున్నా ఫలితం లేదు. కనీసం వారు వాహనం దిగి ఏం జరుగుతుందో తెలుసుకోవడం, రహదారిపైన నిలబడ్డ వారిని వెళ్లగొట్టే ప్రయత్నం చేయరని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సమితి ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

23 కెమెరాలు ఏర్పాటు చేసినా..

మధురానగర్ కాలనీలో 23కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, కేబుళ్లు దెబ్బతినడం, తెగిపోవడం, కెమెరాలు పనిచేయకపోవడం, ఒక కేబుల్ కట్ చేయబోయి సీసీ కెమెరాల కేబుల్ కట్ చేయడం, తదితర కారణాలతో ప్రస్తుతం ఒక్క కెమెరా కూడా పనిచేయడం లేదు. సంక్షేమ సమితి, స్థానికులు స్వయంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

నిఘా నేత్రం ఉండాల్సిందే..

సీసీ కెమెరాల పనితీరు మెరుగుపడితే నేరాల సంఖ్య తగ్గుతుందని పోలీసులు భావిస్తున్నారు. ఒకవేళ నేరం జరిగినా నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తాయి. ముఖ్యంగా దొంగతనాలు, దాడులు, వైట్ కాలర్ నేరాలు, అదృశ్యం, ఘర్షణలు, తదితర ఘటనలు అధికంగా జరుగుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. గతంలో మధురానగర్‌లో ఓ మహిళ మెడలో నుంచి చైన్‌స్నాచర్ గొలుసును తెంపుకుని పారిపోయాడు. ఈ దృశ్యాలు మధురానగర్, వెంగళరావునగర్‌లలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డు అయ్యాయి. ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌కు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను చూపించగా అతడు స్నాచర్‌ను గుర్తుపట్టాడు. అతడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు స్నాచర్‌ను అరెస్ట్ చేసి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇదేకాకుండా పలు కేసుల్లో కెమెరాలు కీలకమైన సమాచారంతో నిందితులను పట్టించాయి. సీసీ కెమెరాలు పనిచేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నేరాల నియంత్రణ, నేరస్థులను పట్టించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. ఒక్క కెమెరా వందమంది పోలీసులతో సమానం. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా స్థానికుల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. అసోసియేషన్ వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. అన్ని సీసీ కెమెరాలు పనిచేసేలా చూస్తాం.

● ఎస్.మోహన్ కుమార్, ఏసీపీ, పంజాగుట్ట

బ్లాక్‌ల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు



మధురానగర్‌లో కమ్యూనిటీ సీసీ కెమెరాలలో భాగంగా పోలీసుల సహకారంతో గతంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అవి పనిచేయకపోతే కొంతకాలం క్రితం సుమారు రూ.6.70 లక్షల వ్యయంతో కొత్తగా 23 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కొత్త కేబుళ్లు కూడా వేశాం. ప్రస్తుతం ఒక్క కెమెరా కూడా పనిచేయడం లేదు. ఈ విషయమై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సంబంధిత సంస్థకు సమాచారం ఇచ్చాం. తరుచూ కెమెరాలకు సంబంధించిన కేబుళ్లు దెబ్బతింటున్నాయి. వివిధ కేబుళ్ల వారు తెలిసో, తెలియకో సీసీ కెమెరాల కేబుళ్లు కట్ చేస్తున్నారు. కాలనీలో 8 బ్లాక్‌లు ఉన్నాయి. ఏ బ్లాక్‌కు ఆ బ్లాక్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి డీవీఆర్‌లు ఏర్పాటు చేస్తాం. మేము ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలన్నీ సరిగానే పనిచేస్తున్నాయి.

● కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి, మధురానగర్ సంక్షేమ సమితి



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుంటున్న తలసాని దంపతులు

ఎల్లమ్మను దర్శించుకున్న తలసాని దంపతులు

అమీర్‌పేట, మే 6 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట రేణుక ఎల్లమ్మను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్వర్ణ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణ, చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ కార్పొరేటర్ శేషకుమారి, నాయకులు హన్మంతరావు, అశోక్ యాదవ్ వనం శ్రీనివాస్, గుడిగె శ్రీనివాస్, కట్టా బలరాం, శ్రీలక్ష్మి, నాగలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డా.చిన్నారెడ్డి

ప్రజావాణికి 252 దరఖాస్తులు

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 252 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 56, విద్యుత్ 32, రెవెన్యూ 50, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇందిరమ్మ ఇళ్లు 44, ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

మద్యం తాగి హంగామా.. ఎక్స్ వేదికగా ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి రోడ్డుపై కారు యజమాని హంగామా సృష్టించాడు. ఓ నెటిజన్ ఈ వీడియోను ఎక్స్ వేదికగా అప్‌లోడ్ చేశాడు. ఈనెల 4న సాయంత్రం ఓ నెటిజన్ టోలిచౌకి వంతెన పై నుంచి వెళ్తుండగా మద్యం తాగి కారును డ్రైవ్ చేస్తున్న యువకుడు హంగామా సృష్టించాడు. అతివేగంతో కారు నడుపుతూ నెటిజన్‌ను ఓవర్ టేక్ చేయడమే కాకుండా ముందుకు వెళ్లకుండా ఇబ్బంది పెట్టాడు. ఈ వీడియోను ఎక్స్ వేదికగా నెటిజన్ అప్‌లోడ్ చేశాడు. ఈ వ్యవహారంపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రామకృష్ణారావును కలిసిన తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు విడుదల చేయాలి

పంజాగుట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సంఘం నాయకులతో వెళ్లి కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ, సలహాదారు సుంకరి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్‌లు రామరాజువర్మ, శ్రీనివాస్, కార్యదర్శి మహేంద్ర సాగర్, జగన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

కాలనీల్లో చెత్తను తొలగించాలి

● కార్పొరేటర్ కొలను లక్ష్మి

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో చెత్త ఆటో రిక్షా కార్మికులు చెత్తను సక్రమంగా తొలగించడం లేదని కార్పొరేటర్ కొలను లక్ష్మి ఆరోపించారు. మంగళవారం వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెత్త ఆటో కార్మికులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చెత్త ఆటో వాళ్లు సక్రమంగా చెత్తను తొలగించకపోవడంతో కాలనీలు, బస్తీల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. దీని వల్ల ప్రజలు అంటువ్యాధులకు గురవుతున్నారన్నారు. ఏఎంఓహెచ్ మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులతోపాటు బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, ఖలీల్ బేగ్ పాల్గొన్నారు.

అల్జీమర్స్ వ్యాధిపై అవగాహనకు నాటక ప్రదర్శన

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యం కలిగించే నాటకాలకు రోడ్‌వేజ్ థియేటర్ ఆధ్వర్యంలో అల్జీమర్స్ వ్యాధిపై అవగాహన కోసం ఈనెల 16వ తేదీన హైటెక్‌సిటీ టీ-హబ్ ఈగాలేరియా మాల్‌లో 'సంధ్య, తుమ్ కహన్ హో' నాటకాన్ని ప్రదర్శించనుంది. ఈ నాటకానికి రచన, దర్శకత్వం కెప్టెన్ ఎస్ఎన్ అహ్మద్ వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ నాటకం ప్రతీ ఒక్కరిని ఆలోచింప చేయనుందన్నారు. ఈ నాటకం ప్రథమ ప్రదర్శన అనంతరం సైనిక వెటరన్స్, సీనియర్ సిటిజన్ టౌన్‌షిప్స్ వంటి వేదికలపై కూడా ఉంటుందన్నారు. వృద్ధాప్యంలో మతిమరుపు మన దేశంలో చాలా మందిలో ఉందన్నారు. ఇదే కారణంతో అల్జీమర్ ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తున్నామన్నారు. దీంతో అనేక మంది వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అపోహలతో ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. సైన్యంలో తన సహచరులు అల్జీమర్ వ్యాధితో పోరాడుతున్న దృశ్యాలను దగ్గరగా చూశానన్నారు. రియల్ లైఫ్ అనుభవాల నుంచి ప్రేరణ పొందిన ఈ నాటకం హాస్యాన్ని, ఉద్వేగాన్ని సమపాళ్లలో కలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. అద్భుతమైన కథనంతో ఉన్న ఈ నాటకం అల్జీమర్ బాధితులకే కాకుండా, ఆయా కుటుంబాల మౌన వేదనపై దృష్టిని కేంద్రీకరిస్తుందని తెలిపారు. ఇది దయాగుణం, అవగాహన, సామాజిక చర్చకు వేదికగా మారుతుందని పేర్కొన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ

● మంత్రి సీతక్క

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం పాటిగడ్డ ఎన్‌బీటీనగర్‌లోని సన్నబియ్యం లబ్ధిదారుడు అక్బర్ ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, నాయకులు విశాల్ సుదాం, చిరంజీవి, బబ్లూ, శ్రీనివాస్, హనీఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని రేషన్ దుకాణం వద్ద కోట నీలిమ సన్నబియ్యం పంపిణీ చేశారు.



ఎన్‌బీటీనగర్‌లో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, కోట నీలిమ

పేదలను ఆదుకునేందుకే సంక్షేమ పథకాలు



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడతాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్‌లో 24 మందికి షాదీముబారక్, ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లి చేయగానే చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతాయని, ఇలాంటి సమయంలో కొంతమేరకు వారి అవసరాలు తీర్చేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో బాలానగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగమణి, రికార్డు అసిస్టెంట్ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సంజీవ, షరీఫ్, జావీద్, దాసి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి

పంజాగుట్ట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బి.రాజు యాదవ్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈనెల 7 నుంచి డివిజన్ విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమాజిగూడలోని మెర్క్యూర్ హోటల్‌లో హిమాయత్‌నగర్ డివిజన్‌లోని 42 పోలింగ్ బూత్‌ల కార్యదర్శుల సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాసిర్, గోకుల్ కళ్యాణ్, శ్రీరామ్, యాసిన్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు యాదవ్

అర్ధరాత్రి గాలి దుమారం.. కరెంట్ లేక సతమతం

ఖైరతాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా వచ్చిన గాలిదుమారం, వర్షంతో ఖైరతాబాద్‌లో సోమవారం రాత్రి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద ఎత్తున గాలి దుమారం రావడంతో ఖైరతాబాద్ మార్కెట్ రహదారి, చేపల మార్కెట్ వీధిలో పలు చెట్లు విరిగిపడ్డాయి. చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో కరెంట్ పోయింది. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు కరెంట్ లేకపోవడంతో ఉక్కపోతతో స్థానికులు సతమతమయ్యారు. రాత్రి సమయంలో అధికారులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదని, అర్ధరాత్రి స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు స్పందించి రాత్రి 2 గంటలకు కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని స్థానికులు చెప్పారు. ఖైరతాబాద్‌లో కొన్ని చెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వాటిని పరిశీలించి అవసరమైతే తొలగించాలని కోరినా, అధికారులు స్పందించలేదని స్థానికులు ఆరోపించారు.



ప్రాచీన హనుమాన్ ఆలయంలో ఒరిగిన పురాతన రావిచెట్టు

కూలిన పురాతన రావిచెట్టు

లక్డీకాపూల్‌లోని ప్రాచీన జాలి హనుమాన్ ఆలయంలోని పురాతన రావిచెట్టు సోమవారం వచ్చిన గాలి దుమారానికి ఒరిగింది. కింది నుంచి వేర్లతో సహా పెకిలించినట్లు ఒకవైపు ఒరగగా దాని పక్కనే ఉన్న నవగ్రహ మండపంపైన పడడంతో దాని స్లాబ్ దెబ్బతిన్నది. దీంతో అటవీశాఖ, జీహెచ్ఎంసీ, ఎమర్జెన్సీ బృందాలు మంగళవారం ఆ చెట్టుకొమ్మలను కట్ చేయించి అక్కడే చెట్టును రీలోకేట్ చేశారు. ఆలయం బయటి నుంచి రెండు భారీ క్రేన్ల సహాయంతో చెట్టును రీలోకేట్ చేశారు.

బొటానికల్ గార్డెన్ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభం

గచ్చిబౌలి, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో సంస్థ వైస్ చైర్మన్ జి.చంద్రశేఖర్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధి, ఎకో టూరిజం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, సీఎస్ఆర్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అనరంతరం దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పది రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని, ఇందులో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

11న నరసింహస్వామి జన్మదినం

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని స్వయంభు లక్ష్మీనరసింహస్వామి(స్వర్ణ) ఆలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నరసింహ జన్మదిన వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం అనంతరం నరసిం హ హోమం, భూ సమేత నరహసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.



దొంగిలించిన వాహనాలతో నిందితులు

వేర్వేరు చోట్ల ద్విచక్ర వాహనాలు చోరీ

● ఐదుగురి అరెస్టు ● నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు సంఘటనల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. వారి నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సింగాడికుంటకు చెందిన మహ్మద్ అజారుద్దీన్ మెకానిక్. డబ్బు కోసం ద్విచక్రవాహనాలు చోరీ చేస్తుంటాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసి ఓ మైనర్‌కు రూ.10 వేలకు అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో జల్సా చేశాడు. ఇదేవిధంగా బోయిన్‌పల్లికి చెందిన మహ్మద్ ఫిరోజ్, మహ్మద్ సమీర్ ద్విచక్రవాహనాలు చోరీ చేస్తుంటారు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో హోండా డ్యూయో వాహనాన్ని చోరీ చేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే మహ్మద్ షాదాబ్, రిజ్వాన్ రెండు ద్విచక్రవాహనాలను చోరీ చేసి ముర్తుజా అనే వ్యక్తికి అమ్మేశారు. ముర్తుజా ఇద్దరు మైనర్లకు అమ్మేశాడు. పోలీసులు అజారుద్దీన్, మహ్మద్ ఫిరోజ్, మహ్మద్ సమీర్, మహ్మద్ షాదాబ్, ముర్తుజాలను అరెస్టు చేశారు. రిజ్వాన్ పరారీలో ఉన్నాడు. ముగ్గురిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు.

ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం, నగదు..

బంజారాహిల్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం, నగదు చోరీ చేశారు. పశ్చిమగోదావరికి చెందిన షేక్ షబానా కమలాపురికాలనీలో నివాసం ఉంటున్నాడు. ఓ కేసు విషయంలో విచారణ ఎదుర్కొంటుండడంతో ఇంటికి తాళం వేసి రహ్మత్‌నగర్‌లో ఉంటున్నాడు. కాగా, ఈనెల 5న కమలాపురికాలనీలోని ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్నాడు. వెంటనే ఇంటికి వెళ్లి చూడగా, బీరువాలో ఉన్న 2.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మానసికంగానూ, శారీరకంగానూ వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేసింది. మధురానగర్ సి బ్లాక్‌లో ఉండే దివ్యభారతిని భర్త నవకళ్యాణ్ కొంతకాలంగా మానసికంగానూ, శారీరకంగానూ ఇబ్బందులకు గురిచేయడంతో పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చిన దివ్యభారతి ముఖంపై దాడి చేసి ఇంట్లో నుంచి సుమారుగా రెండు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను భర్త ఎత్తుకెళ్లాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలకరించలేదని దాడి

యూసుఫ్‌గూడ, మే 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.మధు ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌లోని స్నేహితుడు నితీష్ ఇంటికి వచ్చాడు. ఇంటి సమీపంలోని మెట్లపై బన్ని, భూపతి మద్యం తాగుతున్నారు. భూపతిని పలకరించలేదని పక్కనే ఉన్న గల్లీలోకి మధును తీసుకెళ్లి దాడి చేశాడు. దీంతో మధు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

యూసుఫ్‌గూడ, మే 6 (ఆంధ్రజ్యోతి): చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మధురానగర్ నలంద పాఠశాల సమీపంలో నివసించే ఆర్. సురేఖ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలాల్లో చెత్త వేయవద్దు : కార్పొరేటర్


నాలా శుద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

చిలకలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): మురుగు నీరు నిలువకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు, స్థానికులు నాలాల్లో చెత్త వేయవద్దని మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత కోరారు. డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీలో సోమవారం నాలాల శుద్ధి పనులను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ పలుమార్లు విజ్ఞప్తులు చేసినా స్థానికులు నాలాల్లో చెత్త వేస్తున్నారని, దానితో మురుగు నీరు నిలిచి సమస్యలు తలెత్తుతున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ నాలాల్లో చెత్త వేయవద్దని, వేసిన వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు రాజన్, హరి, జెన్యూట్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నతోకట్ట హిందూ శ్మశాన వాటిక నూతన కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న జంపన ప్రతాప్

శ్మశాన స్థలాలను కబ్జా చేస్తే క్షమించేది లేదు

బోయినపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పరిధిలో గతంలో కబ్జాకు గురైన హిందూ శ్మశాన స్థలాలను స్వాధీనం చేసుకునే దిశగా నూతనంగా ఏర్పడిన కమిటీ చర్యలు తీసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచించారు. చిన్నతోకట్ట హిందూ శ్మశాన వాటిక నూతన కమిటీ ఏర్పాటు కావడం జరిగింది. ఈ క్రమంలో నూతన కమిటీ సభ్యులు మంగళవారం న్యూ సిటీ కాలనీలోని జంపన ప్రతాప్ నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ కబ్జాదారుల బెదిరింపులకు కమిటీ భయపడవద్దని, వారి ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండల్ యాదవ్, సదానంద్, ముకేశ్ యాదవ్, రామారావు, విజయ్, ఇటుక గోపీ, తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజలకు పెరిగిన డిమాండ్


అమ్మకానికి సిద్ధంగా వున్న తాటి ముంజలు

చిలకలగూడ, మే 6(ఆంధ్రజ్యోతి): ఎటువంటి క్రిమి సంహారక మందులు, ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తాటి ముంజలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వేసవి కాలంలో శరీరానికి చల్లదనం అందించే ఈ ముంజల్లో నీటి శాతం, పోషక విలువలు అధికంగా వుంటాయని, సీజనల్ ఫ్రూట్స్ తినడం ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. సికింద్రాబాద్, అలుగడ్డబావి, తార్నాక, ఏబీసీ సెంటర్, పెరేడ్ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ధర విషయానికి వస్తే డజను వంద రూపాయలకు అమ్మకాలు సాగిస్తున్నామని ఘటకేసర్ నుంచి వచ్చిన వ్యాపారి అంకిత్ తెలిపాడు. అమ్మకాలు బాగా సాగుతున్నాయని, ఇవి రెండు నెలలు మాత్రమే లభ్యమవుతాయని తెలిపాడు.



సన్నబియ్యం పంపిణీ

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్నబియ్యం పథకంలో భాగంగా మంగళవారం బొల్లారం రిసాలబజార్ రేషన్‌షాపులో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్, పాటు బాబు సుందరం, కన్న తదితరులు ఉన్నారు. - తిరుమలగిరి మే 6 (ఆంధ్రజ్యోతి)

లారీ ఢీకొని వృద్ధుడికి తీవ్రగాయాలు

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని జీహెచ్ఎంసీ చెత్త తరలింపు లారీ ఢీకొట్టడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కాచిగూడ పీఎస్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్ సిగ్నల్ వద్ద రేణుకాఎల్లమ్మ ఆలయం సమీపంలో గోల్నాకకు చెందిన సిద్ధేశ్వర్(62) రోడ్డు దాటుతుండగా అదే సమయంలో జవహర్‌నగర్‌లో చెత్త డంప్‌చేసి తిరిగి వస్తున్న జీహెచ్ఎంసీ లారీ ఢీకొట్టింది. సిద్ధేశ్వర్‌కు ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు గాయపడిన వృద్ధుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ చెత్త లారీ డ్రైవర్ మాపీజుల్‌షేక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కానరాని ఉచిత మరుగుదొడ్లు

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు
- పునఃనిర్మాణంలో తప్పని తిప్పలు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అత్యవసర పరిస్థితిలో మరుగుదొడ్లు కనిపించడంలేదు. ఓవైపు శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ ప్లాట్ ఫాంలపై ఉన్న పెయిడ్ మరుగుదొడ్లు ప్రయాణికులకు కనిపించకపోవడంతో హైరాన పడుతున్నారు. అలాగే ఉచిత మరుగుదొడ్లు లేకపోవడం ఇక్కడ ఇబ్బందిగా మారుతోంది. దక్షిణ మధ్య రైల్వేకు అత్యధిక స్థాయిలో కోట్ల రూపాయల ఆదాయం చూపిస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఈ కష్టాలు తప్పడంలేదు. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఈ రైల్వేస్టేషన్ ప్రయాణికులకు సేవలందించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. సికింద్రాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు రాకపోకలు సాగించే సాధారణ ప్రయాణికులకు అందుబాటులో మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు నరకం అనుభవిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న పది ప్లాట్‌ఫాంల్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న యూజ్ అండ్ పే టాయిలెట్, ఏసీ టాయిలెట్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సాధారణ ప్రయాణికులు ఈ టాయిలెట్‌లకు వెళ్లేందుకు అనుమతి లేదు. రిజర్వేషన్ తీసుకున్న వారికి మాత్రమే సౌకర్యాలు కల్పించారు. జనరల్ బోగీలు, ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణిస్తున్న వారికి ఉచితంగా వెళ్లేందుకు మరుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎంలు అనేక సార్లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను తనిఖీలు చేశారు. కానీ ఇక్కడ ఉచిత మరుగుదొడ్డి సౌకర్యం కల్పిస్తామంటూ చెప్పలేదు. ప్రయాణికులకు అనుకూలంగా తాత్కాలిక ఉచిత టాయిలెట్ నిర్మాణం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొలను లక్ష్మి

కాలనీల్లో చెత్తను తొలగించాలి : కొలను లక్ష్మి

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లో చెత్త ఆటో రిక్షా కార్మికులు చెత్తను సక్రమంగా తొలగించడం లేదని కార్పొరేటర్ కొలను లక్ష్మి ఆరోపించారు. మంగళవారం వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెత్త ఆటో కార్మికులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చెత్త ఆటో వాళ్ల సక్రమంగా చెత్తను తొలగించకపోవడంతో కాలనీలు, బస్తీల్లో చెత్త పేరుకుపోతుందన్నారు. దీని వల్ల ప్రజలు అంటువ్యాధులకు గురవుతున్నారన్నారు. ఏఎంఓహెచ్ మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులతోపాటు బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, ఖలీల్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డా.చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 252 దరఖాస్తులు

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 252 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 56, విద్యుత్ 32, రెవెన్యూ 50, ప్రవాసీ ప్రజావాణికి 1, ఇందిరమ్మ ఇళ్లు 44, ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

జై బాపు-జైభీమ్-జై సంవిధాన్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జై బాపు-జైభీమ్-జై సంవిధాన్ ర్యాలీ మంగళవారం కంటోన్మెంట్ అన్నానగర్‌లో జరిగింది. స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ ఆధ్వర్యంలో అన్నానగర్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్‌నగర్, సీతలపోచమ్మ ఆలయం, బాలంరాయి మీదుగా లీ ప్యాలెస్ ఫంక్షన్ హాలు వరకు సాగింది. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ సికింద్రాబాద్ జిల్లా పరిశీలకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, రాచమల్ల సిద్ధేశ్వర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదని, అంబేడ్కర్‌ను అవమానపరుస్తున్నదని విమర్శించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించాలి

అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడుతున్న ప్రభుత్వం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని, అమలు చేస్తున్న అన్ని పథకాల గురించి ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని కాంగ్రెస్ పార్టీ నేతల ఎమ్మెల్యే శ్రీగణేష్ పిలుపునిచ్చారు. గత పాలకుల పుణ్యమా అని ఆర్థిక పరిస్థితి ఆశాజనంగా లేనప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న అమోఘమైన పాలన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మంగళవారం జరిగింది. శాసనసభ్యుడి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా పరిశీలకులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, రాచమల్ల సిద్ధేశ్వర్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఇన్‌చార్జి పట్నం సునీత మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సేకరించారు.

సీసీ రోడ్డు వేశారు.. మరుసటి రోజే తవ్వారు!

- వారాసిగూడ స్థానికుల ఆగ్రహం
- మ్యాన్‌హోల్స్‌లోకి రెడీమిక్స్ కంకర
- ఇళ్లలోకి రివర్స్‌లో డ్రైనేజీ నీరు

బౌద్ధనగర్, మే 6(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ పోచమ్మ దేవాలయం వీధిలో నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డును సీవరేజీ పైపులైన్ మరమ్మతుల నిమిత్తం ఒక్క రోజులో తవ్వివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారాసిగూడ పోచమ్మ దేవాలయ వీధిలో రెండున్నర సంవత్సరం క్రితం సీవరేజీ పైపులైన్ మరమ్మత్తుల నిమిత్తం బీటీ రోడ్డును తవ్వారు. నూతన రోడ్డు వేయాలని రెండున్నర సంవత్సరాల నుంచి స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీని స్థానికులు కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఇటీవల నూతన రోడ్డు నిర్మాణానికి ముప్పై మూడు లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ ఈ పనులను తక్కువ రేటుకు మరో సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించాడు.


సీసీ రోడ్డును తవ్వి సీవరేజీ పనులు చేపడుతున్న సిబ్బంది


రెడీమిక్స్ కంకర వేయడంతో పూడుకుపోయిన మ్యాన్‌హోల్

ఒక్కరోజులో వేయాల్సిన రోడ్డును ఐదురోజులు వేశారు. సిమెంట్‌రోడ్డు వేసేటప్పుడు మ్యాన్‌హోల్స్‌లోకి రెడీమిక్స్ కంకర వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవేమి పట్టించుకోకుండా మ్యాన్‌హోల్‌లోకి కంకర వేశారు. దీంతో మ్యాన్‌హోల్ లోపల రెడీమిక్స్ కంకర బిగుసుకుపోవడంతో ఇళ్ల నుంచి డ్రైనేజీలోకి వచ్చే మురుగునీరు రివర్స్‌లో ఇళ్లలోకి రావటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై స్థానికులు జలమండలికి ఫిర్యాదు చేయగా సబ్ కాంట్రాక్టర్‌తో చేయించుకోవాలని సూచించారు. సబ్ కాంట్రాక్టర్ సిబ్బందిని ఏర్పాటుచేసి మిషన్‌ల ద్వారా మ్యాన్‌హోల్‌లోని రెడీమిక్స్ కంకరను బయటకు తీశారు. మ్యాన్‌హోల్‌లో సీవరేజీ పైపులైన్‌లోకి కంకర వెళ్లటం, అవి పగిలిపోవటంతో వేసిన నూతన సిమెంట్ రోడ్డును మిషన్‌ల ద్వారా తవ్వారు. ఒక్కరోజులో వేసిన సిమెంట్ రోడ్డును తవ్వివేయటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


యాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు పవన్ కుమార్ యాదవ్, సభ్యులు

వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడి నియామకం

మారేడుపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి) : యాదవ్ వెల్ఫేర్ అసోసియేషన్(రాంనగర్ పికెట్) అధ్యక్షులుగా జి.పవన్ కుమార్ యాదవ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు పికెట్‌లో మంగళవారం సీనియర్ సభ్యులు నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల పేర్లను ప్రకటించారు. అధ్యక్షులుగా పవన్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా జె.సందీప్, ప్రధాన కార్యదర్శి జె.సతీష్, కోశాధికారి కిషోర్, లీగల్ అడ్వైజర్స్ నాగుల శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ వెంకటేశ్వర్లు, సామ్‌రాజ్, భరత్‌రాజ్, మధుసూధన్, లక్ష్మణరావు, సాయి గణేష్, నాగేష్‌లను ఎన్నుకున్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి


అక్రమంగా నిర్మించిన గోడను చూపుతున్న వేల్ మురుగన్

రాంగోపాల్‌పేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కలాసీగూడకు చెందిన ఏబి వేల్ మురుగన్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తన పురాతన ఇంటిని కూల్చివేస్తుండగా తన ఇంటి పక్కనే నివాసం ఉండే వ్యక్తి తమ ఇంటి పైభాగంలో ఉన్న గోడపై నుంచి వారి గోడను నిర్మించినట్లు గ్రహించి, దానిని తొలగించాలని జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్‌కు గత సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు పరిశీలించి అది అక్రమ కట్టడమేనని నిర్ధారించి కూడా తొలగించడంలో తాత్సరం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై గత నెల 7న ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్, కూడా జీహెచ్ఎంసీ డీసీకి వినతిపత్రం అందించారు. సదరు వ్యక్తి వెనుక గల్లీని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డిఫెన్స్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సీనియర్ సిటిజన్ అయిన తనను అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని కోరారు.

107వీ బస్సులను అంబర్‌పేట మీదుగా నడపాలి

బర్కత్‌పుర, మే 6 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీ.నగర్, సరూర్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే 107వీ ఆర్టీసీ బస్సులను అంబర్‌పేట మీద నడపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనుల వల్ల ఈ బస్సులను ఆలీకేఫ్ చౌరస్తా, జిందాతిలిస్మాత్‌నగర్, ఛేనంబర్ చౌరస్తా మీదుగా అటు సికింద్రాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు జిందాతిలిస్మాత్ కంపెనీ నుంచి గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్నాయి. అయితే కంటోన్మెంట్ డిపోకు చెందిన 107జే బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఆలీకేఫ్ చౌరస్తా, పోలీస్‌లైన్, అంబర్‌పేట మీదుగా వెళ్తున్నాయి. అయితే దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన 107 బస్సులు మాత్రం అంబర్‌పేట వైపు రావడం లేదు. దీంతో సికింద్రాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఆలీకేఫ్ చౌరస్తా వరకు, దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే ప్రయాణికులు జిందాతిలిస్మాత్ కంపెనీ వరకు వెళ్లి బస్సులను ఎక్కాల్సి వస్తుందన్నారు. దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులు పూర్తి కావడం వల్ల అటు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఇటు సికింద్రాబాద్ నుంచి వచ్చే 107వీ, 107జే బస్సులను శ్రీరమణచౌరస్తా, పోలీస్ లైన్, ఆలీకేఫ్ చౌరస్తా మీదుగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆస్తమాను నిర్లక్ష్యం చేయొద్దు

ముషీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆస్తమాను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యం పొందితే నివారించవచ్చని సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ అలీమ్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఉచిత ఆస్తమా వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అబ్దుల్ అలీమ్ 80 మందికి పైగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ... స్వేచ్ఛగా ఊపిరి తీసుకోవాలనే నినాదంతో ప్రజల్లో ఆస్తమాపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమకు ఆస్తమా ఉందని చాలా మందికి తెలియదని పేర్కొన్నారు. సకాలంలో ఆస్తమాను గుర్తించకుంటే ప్రాణాలకే హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భారతి, రాజు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ


పేదలకు సన్నబియ్యం అందజేస్తున్న కోట నీలిమ, విశాల్ సుదాం

బేగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పేదవారికి కడుపు నిండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. మంగళవారం బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుదాం ఆధ్వర్యంలో రేషన్ దుకాణం ద్వారా తెల్లకార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదవారి ఆకలి తీర్చాలని సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. త్వరలో రేషన్ కార్డులు లేని వారికి కార్డులను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలీంఖాన్, హనిఫ్‌ఖాన్, మునీర్‌ఖాన్, జగదీష్, బబ్లూ పాల్గొన్నారు.

పార్క్ నిర్వహణ అధ్వానం

రాంగోపాల్‌పేట్ పార్కులో చెత్తా చెదారం

రాంగోపాల్‌పేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం పంచాల్సిన పార్క్ అధికారుల పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా తయారైంది. పార్క్ అందుబాటులోకి ఉన్నప్పటికీ అందులో పచ్చదనం, వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో పాటు ఎక్కడపడితే అక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో పార్క్‌లోకి వెళ్లడానికి ప్రజలు ఆసక్తి చూపడం లేదు. రాంగోపాల్‌పేట్‌లో గల పార్క్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లగుట్ట అభివృద్ధి సంఘం పక్కన ఉన్న రాంగోపాల్‌పేట్ పార్క్‌లో చెత్తా చెదారంతో నిండిపోతుంది. దీనితో పార్క్‌లో ఆహ్లాదం కనుమరుగవుతుంది. పైగా పోలీసుల నిఘా లేకపోవడంతో మందుబాబులకు ప్రశాంత వాతావరణం ఏర్పడడంతో వారికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. పార్క్‌లో ఆట పరికరాలు విరిగిపోయి పిల్లలు ఆడుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీనితో వేసవి సెలవులు అయినప్పటికీ పిల్లలు ఆడుకునేందుకు ఈ పార్క్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.


మధ్యాహ్నం పార్క్‌లో నిద్రిస్తున్న వ్యక్తి


పార్క్‌లో ఉన్న మందు సీసాలు

అభివృద్ధి చేయాలి



పార్క్‌లో చిన్న పిల్లలకు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్, కూర్చోవడానికి బెంచ్‌లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవాలి. పార్క్‌ను అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అనేకమార్లు అధికారులను ఆదేశించారు. అధికారులలో ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

- సాయిబాబా, నల్లగుట్ట నివాసి

అధికారుల దృష్టికి తీసుకువెళతాం



పార్క్ సమస్య తమ దృష్టికి వచ్చింది. పార్క్‌లో సమస్యలు ఉన్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళతాం. త్వరలో సమస్యను పరిష్కరించి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తాం.

-చీర సుచిత్ర, కార్పొరేటర్ రాంగోపాల్‌పేట్ డివిజన్